సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ
కడప 19వ డివిజన్ పూసల వీధిలో జీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్టు ప్రొప్రైటర్ జీఎస్ఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

-8లో



అరటితోట దగ్ధం
పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లెలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ వల్ల అరటి తోట దగ్ధమైంది. సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లింది.

-8లో

గరిష్టం/కనిష్టం
43.2/27.8

వాతావరణం
జిల్లాలో మంగళవారం 27.8 - 43.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పోలింగ్‌రోజు సెలవు
కడప కోటిరెడ్డిసర్కిల్: కార్మికశాఖ దుకాణాలు, సంస్థల చట్టం–1988 ప్రకారం మే 13న రాష్ట్ర శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఓటుహక్కు వినియోగించుకునేందుకు కార్మిక కమిషనర్ సెలవు ప్రకటించారని జిల్లా కార్మికశాఖ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి వ్యక్తికి ఓటు వేసేందుకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై యజమానికి జరిమానాతోపాటు శిక్షార్హులవుతారని ఆయన వివరించారు.

ఎన్నిక నియమావళి ఉల్లంఘనపై కేసు
ముద్దనూరు: మండలంలోని బొందలకుంట గ్రామంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి మంగళవారం తెలిపారు. బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి 21వతేదీన బొందలకుంటగ్రామంలో పర్యటించినప్పుడు గ్రామంలో టపాసులు పేల్చారు. ఈ ఘటనలో సుబ్బయ్య, ఖాదరయ్య, రామచంద్రుడు అనే ముగ్గురిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు జనరల్ అబ్జర్వర్ల రాక
కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ జిల్లా కోసం నియమించిన ఇద్దరు జనరల్ అబ్జర్వర్లు బుధవారం జిల్లాకు రానున్నారు. కడప, పులివెందుల, కమలాపురం శాసనసభ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా 2011 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కునాల్‌సిల్కును నియమించారు. లైజన్ అధికారిగా కడప మండల వ్యవసాయాధికారి ఎస్వీ సురేష్‌కుమార్‌రెడ్డి (సెల్ 8331057317)ని నియమించారు. బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు శాసనసభ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి భానుదాస్ పలావేను నియమించారు. లైజన్ అధికారిగా జిల్లా వ్యవసాయశాఖలో పనిచేస్తున్న వ్యవసాయాధికారి జి.లక్ష్మణకుమార్ (సెల్ 83310 57341, 94411 49805)ను నియమించారు. పోలీసు జనరల్ అబ్జర్వర్‌గా ఢిల్లీ నుంచి ఐపీఎస్ అధికారి అర్జిత్‌సేన్ ఠాకూర్ బుధవారం రానున్నారు. జిల్లా వ్యయ పరిశీలకులుగా 2014 ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన సతేంద్రసింగ్, 2015 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి రాజేష్‌కుమార్‌మీనా, 2013 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి రమేష్ భారతి ఇదివరకే జిల్లాకు వచ్చారు.

మదరసాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
రాయచోటి టౌన్: మదరసా ఏ దారుల్ ఉలూమా ఇమ్‌దాదియాలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మదరసా ప్రిన్సిపల్ ముఫ్తి సయ్యద్ మాసూమ్ సాఖిబ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. దారుల్ ఉలూమ్ ఇమ్‌దాదియా మదరసాలో నూరానీ – ఖాయిద, నాజిర ఖురాన్, హిఫ్జ్, పార్సీ, దరిసె నిజామి, మౌల్వీ కోర్సులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, వైద్య, బస సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. దీనియాత్ చదివే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిలబస్ ప్రకారం హైస్కూల్ వరకు ఓపెన్ స్కూల్ విద్యాబోధన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9441432607, 9030272740, 8500962886, 9160746484 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సేవలపై తనిఖీ




రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని శ్రీరాములపేట అర్బన్ సెంటర్ పరిధిలో అమలు అవుతున్న ఆరోగ్య సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నడింపల్లె సచివాలయం పరిధిలోని బాలాజీనగర్, వినాయకనగర్‌లలో టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి, డీపీఓ నారాయణ, డీహెచ్ఎన్ఓ అరుణకుమారి, డీఎస్ఓ హరినాథ్‌లు తనిఖీలు చేశారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలతోపాటు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణీలకు టాస్క్ బృందం సభ్యుల సమక్షంలో రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు ఎంతో సురక్షితమని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేసిన ఆరోగ్య సేవలను రికార్డులతో సరి చూశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ జయమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● డామిట్..

కథ అడ్డం తిరిగింది!

- నాడు బాబాయ్ కోసం అబ్బాయ్ ఎదురుచూపులు
- నేడు అబ్బాయ్ లేనిదే నియోజకవర్గంలో కదల్లేని బాబాయ్
- జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి ఆది పరిస్థితి అగమ్యగోచరం



సాక్షి ప్రతినిధి, కడప: ఎంతటి సమావేశమైనా సరే, ఆయన వచ్చేంతవరకూ వేచి ఉండాల్సిందే. కుటుంబ సభ్యులకైనా, అనుచరులకైనా, సన్నిహితులైనా ఎవరికైనా సరే, ఆయన చెప్పిందే వేదం, సూచించిందే ఫైనల్. మరీ ముఖ్యంగా బాబాయ్ మాట కోసం అబ్బాయ్‌కి ఎదురుచూపులు ఉండేవి. ఇదంతా గతం. ప్రస్తుతం కథ అడ్డం తిరిగింది. అబ్బాయ్ లేనిదే బాబాయ్ బయటికెళ్లలేని దుస్థితి ఎదురవు తోంది. 'అహం బ్రహ్మస్మీ' అన్నట్లుగా వ్యవహారం తల్లకిందులయ్యింది. నా అనుకున్న వారంతా ఛీదరించుకునే పరిస్థితి ఉత్పన్నమైంది. అబ్బాయ్ కోసం బాబాయ్ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈమొత్తం వ్యవహారం జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డికి వర్తించనుంది.

'ఆది మాట తప్పడు, మడమ తిప్పడు' అనే నినాదంతో ఆదినారాయణరెడ్డి రాజకీయ ఆరంగ్రేటం చేశారు. అనతికాలంలోనే అవకాశవాదికి నిదర్శనం 'ఆది' అని ఆయన చర్యలు రుజువు చేశాయి. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చలువ నీడలో ఎదిగిన ఆది తక్కువ కాలంలోనే సహజ సిద్ధమైన ప్రవర్తన బహిర్గతమవుతూ వచ్చింది. అప్పట్లో జిల్లాలోని నాయకులంతా వైఎస్ కుటుంబానికి అండగా పదవులు త్యజించేందుకు సిద్ధం అయ్యారు. అప్పటి అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా నిలిచారు. ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులుపై అనర్హత వేటు పడింది. కానీ అప్పట్లో 'అసెంబ్లీలో కిరణ్...బయట జగన్' అంటూ ఆదినారాయణరెడ్డి కొత్త పల్లవి అందుకున్నారు. అధికారాన్ని కోల్పోయేందుకు ఇష్టపడని ఆయన వైఎస్ కుటుంబానికి అండగా నిలువలేకపోయారు. కానీ వైఎస్ కుటుంబం అండ లేకపోతే, గెలిచే పరిస్థితి లేదని 2014లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిత్వం స్వీకరించి జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో చేరి ..మంత్రి పదవి దక్కించుకున్నారు. అంతటితో ఆగకుండా వైఎస్ కుటుంబంపై ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడారు. తొమ్మిది న్నర చెప్పుతో కొట్టాలన్నారు. ఫలితంగా తర్వాత జరిగిన ప్రజాతీర్పులో ఆదినారాయణరెడ్డి కొట్టుకుపోయారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కుటుంబంలోనూ ఏకాకిగా...

కుటుంబంలో ఎప్పుడూ పైచేయిగా నిలిచే ఆదినారాయణరెడ్డి తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏకాకిగా మిగిలారు. విభజించు, పాలించు అన్న ధోరణిని వంటబట్టించుకున్న ఆయన దేవగుడి కుటుంబంలో అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి రాజకీయ వారసత్వానికి బ్రేకులు వేశారు. మరో సోదరుల తనయులు గోవర్ధన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డిలను చేరదీశారు. ఒక్కమాటలో చెప్పాలంటే భూపేష్‌కు ప్రత్యామ్నాయంగా తయారు చేశారు. 'టీడీపీ ఇన్‌ఛార్జిగా తీసుకోవడం కాదు, టికెట్ తెచ్చుకోవడం గొప్ప. బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుంటుంది, బీజేపీ టికెట్ తనకే ఇస్తుందని' ఏడాదికి ముందు నుంచే ఆదినారాయణరెడ్డి సన్నిహితులతో చెప్పుకుంటూ వచ్చారు. అచ్చం అదే తీరులో పొత్తు పొడవడం, ఆదికి బీజేపీ టికెట్ దక్కడం క్రమంగా తెరపైకి వచ్చాయి. అప్పటి వరకూ రాజకీయంగా బలోపేత చర్యలు చేపట్టిన భూపేష్ నిర్ఘాంతపోయారు.

▶▶ జమ్మలమడుగులో సీన్ రివర్స్

ఆదికి బీజేపీ టికెట్ ప్రకటించిన తర్వాత నాలుగు రోజులైనా స్వగ్రామంలో అడుగు పెట్టని పరిస్థితి తలెత్తింది. కుటుంబం యావత్తు భూపేష్‌కు అండగా నిలిచింది. స్వతంత్ర అభ్యర్థిగా రంగప్రవేశం చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితిని పసిగట్టిన ఆది కొంత ఓపిక పట్టారు. భూపేష్‌కు టీడీపీ పార్లమెంటు టికెట్ అప్పగించేంత వరకూ వేచి ఉండి తర్వాత అడుగు పెట్టారు. ఇక తామంతా ఒక్కటేనంటూ చెప్పుకోవాల్సిన దుస్థితి ఆదినారాయణరెడ్డి వచ్చి చేరింది. జమ్మలమడుగు పర్యటనల్లో భూపేష్ కోసం ఆదినారాయణరెడ్డి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంతకు మనకు అండగా ఉంటున్నాడా? లేదా? అని సన్నిహితులతో క్రాస్ చెక్ చేసుకోవాల్సిన దౌర్భాగ్యం నెలకొంది. మరోవైపు గ్రామ స్థాయి నాయకులు బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని విశ్వసించే పరిస్థితి లేదు. సన్నిహితులే కాదు, సమీప బంధువులు సైతం దూరమవుతున్నారు. ఈక్రమంలోనే జమ్మలమడుగుకు మాజీ మున్సిపల్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సైతం వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆది పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అడుగడుగునా అవకాశవాదం తెరపైకి వస్తుండడమే ఇలాంటి దుస్థితికి కారణమని పలువురు చెప్పుకుంటున్నారు.

రేపు సీఎం వైఎస్ జగన్ రాక

- సీఎస్ఐ చర్చి మైదానంలో భారీ బహిరంగ సభ
- సర్వమత ప్రార్థనలు
- నామినేషన్ వేయనున్న సీఎం జగన్



పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందులకు రానున్నారు. భాకరాపురంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన స్థానిక సీఎస్ఐ చర్చి మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడి నుంచి భాకరాపురంలోని తన స్వగృహానికి చేరుకుని అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి సర్వమత ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా అంబకపల్లె రోడ్డులో గల మినీ సెక్రటేరియట్‌లోని ఆర్ఓ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ఒక సెట్ నామినేషన దాఖలు చేసిన విషయం తెలిసిందే.

▶▶ ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల పరిశీలన



సీఎం పర్యటన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందుల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం భాకరాపురం సమీపంలో ఉన్న హెలిప్యాడ్, సీఎస్ఐ చర్చి మైదానంలో నిర్వహించే బహిరంగ సభ ప్రాంతాలను, అలాగే అంబకపల్లె రోడ్డులో ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ పరిసర ప్రాంతాలతో పాటు, సీఎం పర్యటించే ప్రాంతాల్లో బందోబస్తు, తదితర అంశాలను వారు పరిశీలించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి ఆర్ఓ అధికారితో వెంకటేశ్వర్లతో పలు విషయాలపై చర్చించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే రహదారిలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి, పోలీసులు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

రామయ్య రథోత్సవం.. మురిసె భక్తజనం

- రామనామ స్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట
- తరలివచ్చిన అశేష భక్తజనం



రథోత్సవానికి హాజరైన లక్షలాది భక్తులు (ఇన్‌సెట్) రథంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఒంటిమిట్ట తహసీల్దార్ వై. రమేష్ బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండ రాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కాయకర్పూర నీరాజనాలు అందించారు.

నేడు బ్రహ్మోత్సవాల్లో..

శ్రీరాముడి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు బుధవారం ఉదయం 7 గంటలకు కాళీయమర్ధన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిస్తాడు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరుగుతుంది. అనంతరం రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

రాయచోటి: ఏపీ డీఈఈ సెట్–2024కు సంబంధించి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, రెండేళ్ల ఉపాధ్యాయ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈనెల 23వ తేదీన ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంది. 24 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి ప్రవేశపరీక్ష కంప్యూటర్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. 2024 సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి అర్హులకు 17 ఏళ్లు నిండి ఉండాలన్నారు. గరిష్ట వయోపరిమితి ఉందన్నారు. దరఖాస్తు రుసుము రూ.750లు చెల్లించాలన్నారు. మే నెల 8న చెల్లింపునకు, 9న దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందన్నారు. మే నెల 21వ తేదీన ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. 24వ తేదీన పరీక్ష ఉంటుందన్నారు.

వైభవం.. గంధోత్సవం



తలపై గంధం తీసుకువస్తున్న భక్తులు



గంధోత్సవంలో పాల్గొన్న దర్గా పీఠాధిపతులు

భక్తులతో కిటకిటలాడిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా

కమలాపురం: కమలాపురంలో పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిర్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఉరుసు మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గంధోత్సవం అశేష భక్తజన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధాన్ని ఊరేగించారు. కర్ణాటక నుంచి వచ్చిన డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేస్తూ స్వామి పట్ల ఉన్న భక్తిని ప్రదర్శించారు. గంధోత్సవం ఊరేగింపు తాళిం, మార్కెట్, చౌక్ సెంటర్ మీదుగా దర్గా చేరుకుంది. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు. అనంతరం భక్తులందరికి పంచి పెట్టారు.

ఆశ్చర్యపరిచిన ఫకీర్ల విన్యాసాలు

గంధోత్సవం ఊరేగింపులో ఫకీర్లు చేసిన విన్యాసాలు అలరించాయి. ఊరేగింపు చౌక్ సెంటర్‌కు చేరుకోగానే మేళ తాళాల మధ్య వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫకీర్లు దబ్బళాలను నాలుక, తల, కను రెప్పలు, చెవులు, చేతి కండరాలు, బుగ్గల్లోకి గుచ్చుకొని చేసిన విన్యాసాలు గగుర్పొడిచాయి. తలలోకి పెద్ద ఇనుప కడ్డీని గుచ్చుకొని దానిపై టెంకాయలు పగులగొట్టి అబ్బుర పరిచారు. ఈ విన్యాసాలను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

అలరించిన ఖవ్వాలి పోటీ

ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకొని దర్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీం సాబిరి, ముంబయికి చెందిన కలీం నయీమ్ ల మధ్య రాత్రంతా ఖవ్వాలీ పోటీ పోటా పోటీగా సాగింది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఖవ్వాలీ ప్రియులు ఆద్యంతం ఉత్సాహంగా తిలకించారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా ఉరుసు మహోత్సవాలకు తరలి వచ్చారు. స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతిని కలిసి ఆశీర్వాదం పొందారు.

కొనసాగిన నామినేషన్ల పర్వం

- ఐదోరోజు లోక్‌సభకు 7
- అసెంబ్లీ స్థానాలకు 29 మంది... 31 సెట్లు దాఖలు



కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. జిల్లాలో ఐదవరోజైన మంగళవారం మొత్తం 36 మంది 38 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో కడప లోక్‌సభకు ఏడుమంది ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 29 మంది అభ్యర్థులు 31 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు.

కడప లోక్‌సభ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ తరఫున పందింటి గుర్రప్ప, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) తరుపున రాచినేని వేణుగోపాల్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కుడమల వెంకటసుబ్బారెడ్డి, భరోసా పార్టీ అభ్యర్థిగా చింతల ఏసయ్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి, జన సహాయక శక్తి పార్టీ అభ్యర్థిగా ఎం.హనుమంతరెడ్డి నామినేషన్లు రిటర్నింగ్ అధికారి విజయరామరాజుకు అందజేశారు.

అసెంబ్లీ

బద్వేలు: జన సహాయక శక్తి పార్టీ అభ్యర్థిగా గంగాధర్, ఇండిపెండెంట్‌గా తిరువీధి జయరాములు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దాసరి సుధ, వైఎస్సార్ సీపీ తరపున టి.హరిప్రసాద్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా వెంకట శ్రీనివాసులు, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి తరుపున నాగదాసరి ఓబులేశు నామినేషన్లు దాఖలు చేశారు.

కడప: ఇండిపెండెంట్ అభ్యర్థిగా అచ్చుకట్ల జలాలుద్దీన్ మునీర్, నేషనల్ మహాసభ అభ్యర్థిగా పట్టుపోగుల పవన్‌కుమార్, మహాజన రాజ్యం పార్టీ తరపున షేక్ హుమేరా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పానేటి సుధాకర్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పఠాన్ ఖాదర్‌బాషా తమ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌కు అందజేశారు.

పులివెందుల: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా కర్ణ రమేష్‌కుమార్‌రెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా సూరే నిర్మల, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా సూరే మధుసూదన నామినేషన్లు వేశారు.

కమలాపురం: తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పుత్తా నరసింహారెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేశారు. తెలుగుదేశం పార్టీ తరపున పుత్తా కృష్ణచైతన్యరెడ్డి నామినేషన్ వేశారు.

జమ్మలమడుగు: ఇండిపెండెంట్‌గా వి.జగదీశ్వర్‌రెడ్డి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున బూచుపల్లి పుల్లారెడ్డి, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి తరుపున సింగం సుధాకర్ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ తరుపున గుడిసెనపల్లి ఓబయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అల్లె ప్రభావతి, చదిపిరాళ్ల వీరరఘువర్ధనరెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్రీయ జనతాదళ్ అభ్యర్థిగా భరత్‌కుమార్‌రెడ్డి నామినేషన్లు వేశారు.

ప్రొద్దుటూరు: నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ మహమ్మద్ రఫీ, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా తనగాని కరుణాకర్ నామినేషన్లు వేశారు.

మైదుకూరు: జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా లెక్కల శ్రీనివాసులురెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సిద్దంరెడ్డి శివశంకర్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

క్లుప్తంగా

ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 609 ఫిర్యాదులు అందగా 609 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేయడం జరిగిందన్నారు.

- సి.విజిల్ ద్వారా మొత్తం 367 కేసులు నమోదు కాగా అందులో 224 నిజనిర్ధారణ కాగా, 143 నిరాధారమైనవిగా గుర్తించామన్నారు.
- ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,76,32,555 మేర నగదు, రూ.7,61,40,960 విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. అలాగే 1,078 ఎఫ్.ఐ.ఆర్. కేసులు నమోదు చేశామన్నారు.

అరటితోట దగ్ధం



షార్ట్‌సర్క్యూట్ వల దగ్ధమైన అరటితోట

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లెలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ వల్ల అరటి తోట దగ్ధమైంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన సోమన్న తన పొలంలో అరటి పంట సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల సుమారు ఎకరాకు పైగా అరటితోట దగ్ధమైంది. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక రైతులు ఫైర్‌స్టేషన్ అధికారులకు తెలియజేయగా వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

పెన్నానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలోని పెన్నానదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ చిరంజీవి మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు 30–35 మధ్య ఉంటుందన్నారు. మృతుడు వేసుకున్న బనియన్‌పై జూనియర్ ఎన్‌టీఆర్ బొమ్మ ఉందన్నారు. ఎడమ చేతిపై శివపార్వతుల పచ్చబొట్టు ఉందన్నారు. గ్రామ వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 91211 00530, 94401 60511 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తప్పిన ప్రమాదం

రాజుపాళెం : ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో మండలంలోని కొర్రపాడు సమీపంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ వద్ద మంగళవారం డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. పగిడేల నుంచి తుఫాన్ వాహనంలో 9 మంది వివాహం కార్యక్రమానికి వెళ్లే క్రమంలో టైర్ ఒక్క సారిగా పంచర్ కావడంతో పక్కనే ఉన్నమోరీని ఢీకొట్టగా.. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ఎటువంటి ప్రమాదం జరగకుండా రోడ్డుకు అడ్డంగా నిలబెట్టాడు. అందులో ఉన్న వారికి ఏ చిన్న గాయం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



పార్టీలో చేరినవారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కె. సురేష్ బాబు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సాయినాథశర్మ

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 19వ డివిజన్ పూసల వీధిలో జీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్టు ప్రొప్రైటర్ జీఎస్ఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. జగనన్న పాలన నచ్చి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. పార్టీలో చేరిన వారిలో వెంకట రమణ, జనార్ధన్, అనిల్ కుమార్, అజయ్ కుమార్, సుబ్బరామయ్య, పెంచలయ్య, గంగిశెట్టి, గంగాధర్, శ్రీనివాసులు, ఆనంద్, బాషా, దస్తగిరి , రమణయ్య, శ్రీను, మణి , మధు , మాధవయ్య తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పి. జయచంద్రారెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, బీసీ నాయకుడు మనోజ్, టి. సురేంద్ర, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమారి, రాణా ప్రతాప్, అజ్మతుల్లా, మియ్యా, దేవిరెడ్డి ఆదిత్య, సునీత, మౌలానీ పాల్గొన్నారు.

150 కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె, యన్ పాలగిరి గ్రామాల్లో పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు అధినేత సాయినాథ్ శర్మ అనుచరులు 150 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరపునాయునిపల్లెలో సరోజమ్మ, శ్రావన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 కుటుంబాలు, యన్. పాలగిరిలో రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 80 కుటుంబాలు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సాయినాథ్ శర్మ సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దమ్ము, ధైర్యం ఉన్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని అడిగే దమ్ము ఉన్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబు తన స్వార్థం కోసం ఎంతటివారినైనా వాడుకుని వదిలేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ప్రస్తుతం జనసేన, బీజేపీ పార్టీలను వాడుకోవడం జరుగుతోందని, ఎన్నికలు పూర్తయిన వెంటనే వారిని గాలికి వదిలేస్తారని విమర్శించారు. సాయినాథశర్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు క్రిష్ణ సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య, ఎంపీటీసీ రాఘవ యాదవ్, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీసీసీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య చేరిక



పార్టీలో చేరిన బండి జకరయ్య దంపతులను ఆహ్వానిస్తున్న సురేష్ బాబు, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : పీసీసీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య దంపతులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎన్‌టీఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు 200 మంది కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థి అంజద్‌బాషాను, పార్టీలో చేరుతున్న బండి జకరయ్యను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జకరయ్య మాట్లాడుతూ వైఎస్ కుటుంబం అంటే తనకు ఎంతో గౌరవమని, వైఎస్ఆర్, వైఎస్ రాజారెడ్డి సమక్షంలో తమకు పెళ్లి జరిగిందని గుర్తు చేసుకున్నారు. తాను ఎన్నో కష్ట నష్టాలను ఓర్చి కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని, షర్మిలమ్మ పీసీసీ అధ్యక్షురాలయ్యాక పార్టీకి జవసత్వాలు వస్తాయని భావించానన్నారు. షర్మిల పాదయాత్ర చేసినప్పుడే ప్రజలకు తెలుసని, ఇప్పటి వరకూ ఆమె ఏ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. ఈ విషయాన్నే ఆమెతో చెప్పి కొంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించానని, అప్పటి నుంచి తనను దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే అంజద్‌బాషా విజయానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు మాట్లాడుతూ బండి జకరయ్య దంపతులు వైఎస్సార్‌సీపీలోకి రావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుబాల విజయ్‌కుమార్, బి. కిషోర్ కుమార్, కె. బాబు, జి. గరుడాద్రి, బండి ప్రసాద్, వేణుగోపాల్ నాయక్, త్యాగరాజు, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. సూర్యనారాయణరావు, బి. క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

– ఎమ్మెల్యే రఘురామిరెడ్డి
– వైఎస్సార్ సీపీలో 150 కుటుంబాలు చేరిక

ఖాజీపేట : రైతుల సంక్షేమం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. తుడుమలదిన్నె పంచాయితీలో సుమారు 150 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్టీసీ కడప జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో సానెపల్లి బయపురెడ్డి, సానెపల్లి సుబ్బారెడ్డి, సానెపల్లి నాగముల్లారెడ్డి, మాచుబోయిన ఓబులేసు, చాట్ల విజయభాస్కర్, పి.చంటయ్య, చందాసుబ్బారెడ్డి, ఏనుగు చెన్నారెడ్డి, కొత్తపల్లి వెంకటరెడ్డి తోపాటు వారి అనుచరులు ఉన్నారు.

పుస్తక ప్రదానం

గాజులపల్లె రామచంద్రారెడ్డి రచించిన ద ఓన్లీ వన్ హీరో జగన్ అనే పుస్తకాన్ని డాక్టర్ ఆచార్య మూలె మల్లికార్జునరెడ్డి ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని స్థానిక ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, తుడుమలదిన్నె సర్పంచ్ కొత్తపల్లి కృష్ణారెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కేఎస్ఆర్ఎంలో త్రీ డీ రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటు



త్రీ డీ రోబోటిక్ ప్రింటింగ్ యంత్రంతో కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కోటి రూపాయలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లార్జ్ స్కేల్ రోబోటిక్ ఎఫ్.జి.ఆర్ త్రీ డీ ప్రిటింగ్ లాబ్‌ను ఏర్పాటు చేసినట్లు కందుల విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వివిధ పరిశ్రమలలో ప్రాచుర్యం సంతరించుకున్న ఈ రోబోటిక్ త్రీ డీ ప్రింటింగ్ విధానం వల్ల పరిశోధన, నిర్మాణరంగం, వాహనాల యంత్రాల తయారీ, ఏరోస్పేస్ ఆటోమోటివ్ వాహన భాగాలు, నమూనాలు, వాహనాలు సృష్టించడం కోసం ఆటోమేటివ్ పరిశ్రమలో పెద్దస్థాయిలో ప్రయోజనం పొందవచ్చన్నారు. శిల్పాలను రూపొందించడానికి, వైద్యరంగంలో వైద్య పరికరాలను ఉత్పత్తి చేయడంలో విప్లవాత్మక మార్పు కలుగచేస్తుందని తెలియచేశారు. దీని ద్వారా తక్కువ సమయంలో వేగవంతమైన ఉత్పత్తి, వినూత్న డిజైన్‌లను రూపొందించవచ్చన్నారు.

‘విజయవాణి’ విద్యార్థుల ప్రతిభ



జి.వైష్ణవి



జి.చర్మిళ



ఎం.రిషిత



ఎం.కార్తీక్



ఎం.గణేష్

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా) : చౌడపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి ప్రైవేటు విద్యాసంస్థల్లో పదోతరగతి ఫలితాల్లో 99.10 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విజయవాణి సంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి తెలిపారు. పాఠశాలలో మొత్తం 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 110 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. కాగా వీరిలో జి.వైష్ణవి 583 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలించిందన్నారు జి. చర్మిళ 577 మార్కులు, ఎం రిషిత 572 మార్కులు, ఎం.కార్తీక్ 571మార్కులు, ఎం.గణేష్ 571 మార్కులు సాధించినట్టు తెలిపారు. మరో 36 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించాని చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ జ్యోతి రాణి, హెడ్‌మిస్టర్ కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

ఇదేం మీడియా కేంద్రం!



కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల్లో మీడియా పాత్ర చాలా కీలకమైనది. షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి డిక్లరేషన్ ఆఫ్ రిజల్ట్స్ వరకు సరైన సమాచారం చేరవేయడం ద్వారా ఓటర్లలో చైతన్యం కల్పించడానికి మీడియా దోహదపడుతుంది. భారత ఎన్నికల సంఘం కూడా మీడియా తనకు కళ్లు, చెవులుగా భావిస్తుంది. ఎన్నికల సమయంలో నాణ్యమైన వార్తల ప్రచురణ జరగాలన్న ఉద్దేశంతో మీడియా సెంటర్లను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రస్థాయిలో చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయంలో జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయాల వద్ద మీడియా సెంటర్‌ను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడగా నామినేషన్ల గడువు కూడా ముగింపునకు వస్తోంది. అయినా జిల్లా అధికారులు ఇంతవరకు ఒక మీడియా సెంటర్ ఏర్పాటు చేయలేదనే చెప్పాలి. ఈనెల 17వ తేదీ జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒకరిద్దరు ఈ విషయాన్ని ఆయన ఎదుట ప్రస్తావించారు. తమ కార్యాలయంలో మీడియా కేంద్రాన్ని ఎప్పుడో ఏర్పాటు చేశామని జిల్లా పౌరసంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చెప్పడంతో పాత్రికేయులు విస్తుపోవాల్సి వచ్చింది. ఎందుకంటే ఫలానా రోజు మీడియా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, పాత్రికేయులంతా ఆ కార్యక్రమంలో పాల్గొనాలంటూ సమాచారశాఖ కనీసం ఒక ప్రకటన కూడా ఇవ్వకపోవడం ఇందుకు కారణం. ఇంత ముఖ్యమైన అంశంపై ప్రకటన ఎందుకు ఇవ్వలేదని ఏడీని అడగ్గా ఆయన నుంచి సంతృప్తికర సమాధానం రాలేదు. కలెక్టర్ కార్యాలయానికి సుమారు 100 మీటర్ల దూరంలోని సమాచారశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశామంటున్న మీడియా కేంద్రం ఎలా ఉందో చూద్దామని వెళితే బయట ఒక ఫ్లెక్సీ మాత్రం ఏర్పాటు చేశారు. లోనికి వెళితే సమాచారశాఖ కార్యాలయం, అందులో పనిచేసే సిబ్బంది తప్ప అక్కడ ఏమీ లేదు. రెండు బోర్డులు ఏర్పాటు చేసి అందులో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల సమాచారం ప్రదర్శించడం మినహా అక్కడ ఏమి కనిపించలేదు.

మీడియా కేంద్రంలో పాత్రికేయుల కోసం ప్రత్యేకించి టెలిఫోన్, ఫ్యాక్స్, ఇంటర్నెట్, కంప్యూటర్లు, టీవీ, టెలిప్రింటర్, అన్ని రకాల పత్రికలు, ఫర్నీచర్ వంటి సదుపాయాలు ఉండాలి. గత ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారంతోపాటు ఎన్నికల సంఘం నుంచి ఎప్పటికప్పుడు వచ్చే తాజా మార్గదర్శకాలు, జిల్లా ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు ఇలా ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని మీడియా సెంటర్‌లో అందుబాటులో ఉంచాలి. గతంలో జరిగిన పలు సార్వత్రిక ఎన్నికల్లో ఆనాటి కలెక్టర్లు మీడియాకేంద్రంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఇలాంటి ఏర్పాట్లు చేసేవారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్ తదితర అనేక అంశాలపై ఉన్నతాధికారులతో పాత్రికేయులకు అవగాహన కార్యక్రమాలను కూడా మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసేవారు. జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల పరిశీలకుల ప్రెస్‌మీట్లు కూడా మీడియా సెంటర్‌లోనే జరిగేవి. ఇవన్నీ చూసిన పాత్రికేయులు ఇప్పటిదాన్ని చూసి ఇదేం మీడియా సెంటర్ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామంలో మంగళవారం శ్రీ వీరాంజనేయస్వామి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మజ్జిగ పంపిణీ చేశారు. ఉత్సాహంగా జరిగిన బండ పందెం పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి (రూ. 50 వేలు) ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన కోటేశ్వరరావు ఎద్దులు, ద్వితీయ బహుమతి (రూ. 30 వేలు) కాశినాయన మండలం అనుమారుపల్లెకు చెందిన శీలం జగన్మోహన్‌రెడ్డి, తృతీయ బహుమతి (రూ. 20 వేలు) బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన రామయ్య, చతుర్థ బహుమతి (రూ. 10 వేలు) ప్రకాశం జిల్లా సత్యవోలుకు చెందిన బాలరాజు ఎద్దులు గెలుచుకున్నాయి. ఎద్దుల బండపందెం పోటీలు చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ పోటీలను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో శ్రీ వీరాంజనేయస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

మదనపల్లె : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటరమణ(53) మూడు నెలలుగా మతిస్థిమితం బాగోలేక ఇబ్బంది పడుతున్నాడు. మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మానసికవ్యాధి వైద్యుడి వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటివద్దనే ఉన్న వెంకటరమణ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చాలాసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు వెంకటరమణను ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీకి బుద్ధిచెప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం ఎన్నికల మేనిఫెస్టో కరత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పౌరుల సమానత్వం, వ్యక్తిగత విశ్వాసాలపై బీజేపీ దాడి చేస్తోందని.. ఎన్నికలలో ప్రజలందరూ బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈనెల 25న కడప ప్రెస్ క్లబ్‌లో ‘ఓటర్ల ప్రజా చైతన్యం’పై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ.గఫార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ తదితరులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఏ.రామ్మోహన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండిలా..

- టెన్త్ విద్యార్థులకు ఈనెల 30 వరకు అవకాశం
- అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూలు విడుదల
- మే 24 నుంచి పరీక్షలు



మదనపల్లె సిటీ : పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్న వారు పునః మూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్ఎంలకు మాత్రమే ఫీజు చెల్లించాలి: ఈ ఏడాది పది పరీక్షలు రాసిన విద్యార్థులు పాసైనా/ఫెయిలైనా పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్ / రీ కౌంటింగ్ కోసం మంగళవారం నుంచి ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్ /రీ కౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జవాబుపత్రాల రీ కౌంటింగ్ /రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల హెచ్ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్ఎంకి మాత్రమే ఫీజును సమర్పించాలి. అన్ని రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేయాలి. సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు ఆమోదించరు.

ముఖ్య సూచనలు: అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్ఎంలు అటెస్టేషన్ చేయించి, సంబంధిత విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. నేరుగా విజయవాడలోని డీజీఈ కార్యాలయం (ఎస్ఎస్‌సీ బోర్డు)కు పంపించరాదు. దరఖాస్తులు పోస్టు ద్వారా స్వీకరించరు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికి మార్కులు వచ్చాయా లేదా అని ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసి విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి కూడుతారు. తప్పుగా కూడి ఉంటే సరి చేసి మార్కులు వేస్తారు. అంతేగాని పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ దరఖాస్తు ఇలా... మే 24వ తేదీ నుంచి జూన్ 3 వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల టైంటేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. వచ్చే నెలలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులకు ప్రతి పాఠశాల హెచ్ఎం/సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఈఓలు ఆదేశాలు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో చెల్లించాలి



చెల్లించాల్సిన ఫీజులను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాలల హెచ్ఎంల లాగిన్ ద్వారా చెల్లించాలి. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలి. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలి.

– పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె

ఘనంగా హనుమాన్ జయంతి



ఒంటె వాహనంపై స్వాములను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : వెల్లాల గ్రామంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శ్రీచెన్నకేశవ స్వామి, సంజీవరాయ, భీమలింగేశ్వర, పార్వతీదేవి, నరసింహ స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వాములను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఒంటె వాహనంపై ఆశీనులను చేసి ఆలయం చుట్టూ భక్తి శ్రద్ధలతో ఆలయ చైర్మన్ జగదీశ్వరరెడ్డి, భక్తులు భజనల పాటలు పాడుతూ ఊరేగించారు. కార్యక్రమంలో వెల్లాల ఆలయాల మాజీ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.